



# నవతరం

సంపుటి :-13 సంచిక : 165 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి మంగళవారం 16 జూన్ 2026 వెల : 1 /- పేజీలు : 4


## పదవికి మాత్రమే విరామం

# ప్రజాసేవకు కాదు



### పదవి విరమణ అనంతరం సమాజసేవకు అంకితమైన జగన్నాథం నాయుడు

- రైతుగా ప్రారంభమైన ప్రయాణం ప్రజాసేవలో విశిష్ట అధ్యాయంగా మారింది
- అక్షరాస్యత ఉద్యమానికి ఊపిరిగా నిలిచి వేలాది మందికి వెలుగులు పంచిన సేవాధారి
- రచయితగా, వ్యాఖ్యాతగా, శిక్షకుడిగా, సామాజికవేత్తగా బహుముఖ ప్రజ్ఞకు ప్రతీక
- 280కి పైగా ప్రభుత్వ కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా అరుదైన గుర్తింపు
- 200కు పైగా పాటలు, పుస్తకాలు, టెలిఫిలింలతో సామాజిక చైతన్యానికి వారధి
- ప్రభుత్వ పథకాలను ప్రజల గడప దాకా చేర్చిన ప్రజా కమ్యూనికేటర్
- పదవీ విరమణ తర్వాత కూడా ఆగని సేవా యజ్ఞం- నేటి తరానికి స్ఫూర్తిగ రేపటి తరాలకు మార్గదర్శి



**'నవతరం' ప్రత్యేక కథనం**

**పదవి ముగిసిందిడ కానీ ప్రజాసేవ ఆగలేదు. ఉద్యోగం నుంచి విశ్రాంతి తీసుకున్నా, సమాజం కోసం తపించే మనసుకు మాత్రం పదవీ విరమణ ఉండదని తన జీవితంతో నిరూపించిన వ్యక్తి వావిలపల్లి జగన్నాథ నాయుడు. అక్షరాస్యత కోసం అడుగులు వేసిన ఆయన, గ్రామీణాభివృద్ధికి అంకితమై పనిచేశారు. వేలాది మందిలో చైతన్యం నింపారు. వేదికపై మాటలతో ఆకట్టుకున్నారు. కలంతో ఆలోచనలు రాశారు. పదేళ్ల క్రితం ప్రభుత్వ సేవలకు వీడ్కోలు పలికినా, నేటికీ ప్రజల మధ్యే ఉండి సేవా దీపాన్ని వెలిగిస్తూ ముందుకు సాగుతున్నారు. ఒక ఉద్యోగిగా కాదుడ ఒక ఉద్యమంగా, ఒక వ్యక్తిగా కాదుడ ఒక విలువగా నిలిచిన ఆయన జీవన ప్రస్థానం నేటి తరానికి స్ఫూర్తిదాయకం.**

నవతరం ప్రతినిధి, శ్రీకాకుళం:

7ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సంతకవిటి మండలం మందరాడ గ్రామంలో జన్మించిన వావిలపల్లి జగన్నాథ నాయుడు జీవితం స్వయంకృషితో ఎదిగిన సాధనకు ప్రతీకగా నిలిచింది. 21వ ఏట వ్యవసాయ రంగంలో అడుగుపెట్టి, అనంతరం ప్రజా జీవితంలోకి ప్రవేశించిన ఆయన మూడు సంవత్సరాల పాటు క్రియాశీల రాజకీయాల్లో పనిచేశారు. అనంతరం డిగ్రీ కళాశాలలో రాజకీయ శాస్త్రం పార్ట్‌టైమ్ లెక్చరర్‌గా సేవలందిస్తూ యువతలో సామాజిక చైతన్యాన్ని పెంపొందించారు.

29వ ఏట సోంపేటలో వయోజన విద్యాశాఖలో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన ఆయన, పర్యవేక్షకుడిగా, సహాయ ప్రాజెక్టు అధికారిగా, సంపూర్ణ అక్షరాస్యత కార్యక్రమం 'అక్షరక్రాంతి'లో సాంస్కృతిక, ప్రచార విభాగ జిల్లా కన్వీనర్‌గా విశేష సేవలందించారు. అక్షరాస్యత ఉద్యమాన్ని ప్రజల ఉద్యమంగా మలచడంలో కీలక పాత్ర పోషించారు.

జిల్లా ప్రాథమిక విద్యా పథకం (డిపెప్)లో ఓఎస్‌డీగా, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ)లో పరిపాలన అధికారిగా, వికలాంగుల సంక్షేమ విభాగం డీపీఎంగా, సదరం జిల్లా కోఆర్డినేటర్‌గా, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు అధికారిగా, ఆరోగ్యం-పోషణ జిల్లా ప్రాజెక్టు అధికారిగా, ఐకెపి జాబ్స్ విభాగంలో సహాయకునిగా పలు కీలక బాధ్యతలు నిర్వర్తించారు.

గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ, మహిళా సాధికారత, ప్రకృతి వ్యవసాయం, ఆరోగ్య అవగాహన, వికలాంగుల సంక్షేమం వంటి రంగాల్లో ఆయన చేసిన సేవలు విశేషమైనవి. ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఫర్ రూరల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో 73, 74వ రాజ్యాంగ సవరణలపై పంచాయతీరాజ్ వ్యవస్థకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాల్లో జిల్లా కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు.




**కలం పట్టిన చైతన్యవేత్త**

జగన్నాథ నాయుడు కేవలం అధికారి మాత్రమే కాదు, సమాజాన్ని చదివిన రచయిత కూడా. 'మార్గదర్శి', 'మత్స్యకార జీవితాలు' వంటి రచనలతో పాటు పలు నాటికలు, ఏకపాత్రాభినయాలు, 200కు పైగా పాటలు రచించారు. సమకాలీన సామాజిక అంశాలపై పత్రికల్లో అనేక వ్యాసాలు రాసి ప్రజల్లో చైతన్యం కలిగించారు.

**వ్యాఖ్యానంలో తనదైన ముద్ర**

వేదికపై ఆయన వ్యాఖ్యానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జిల్లాలోనే కాకుండా వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన 280కు పైగా ప్రభుత్వ కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరించి అరుదైన గుర్తింపు పొందారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అర్థమయ్యే భాషలో వివరించడం ద్వారా ప్రజా కమ్యూనికేషన్‌కు కొత్త ఒరవడి తీసుకొచ్చారు.

**టెలిఫిలింలు, డాక్యుమెంటరీల ద్వారా సామాజిక సందేశాలు**

'అక్షరం శరణం గచ్ఛామి' టెలిఫిలింలో హీరోగా నటించిన ఆయన, 'మన ఇల్లు' లఘు చిత్రాన్ని రూపొందించారు. 'ప్రగతికి పంచసూత్రాలు' టెలిఫిలింలో కథ, మాటలు, నటన, ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించారు. 'చెట్టు పట్టా' పథకంపై డాక్యుమెంటరీ, 'అక్షర స్వరాలు', 'ప్రగతి స్వరాలు' ఆడియో క్యాసెట్ల రూపకల్పనలోనూ కీలక పాత్ర పోషించారు.

**సేవకు పదవీ విరమణ లేదు**

2016 జూన్‌లో పదవీ విరమణ పొందిన తర్వాత కూడా ఆయన సేవా యజ్ఞం ఆగలేదు. హర్షవల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా, భారత జాతీయ కళలు-సాంస్కృతిక వారసత్వ సంస్థ (×చీూాజ౧ు) శ్రీకాకుళం విభాగ అదనపు కన్వీనర్‌గా, గాంధీ మందిరం, స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి వనం, పలు స్వచ్ఛంద సంస్థల్లో సభ్యుడిగా సేవలందిస్తున్నారు.

మాజీ నేరస్తుల పునరావాసం కోసం 'సంస్కరణ' కార్యక్రమం, ప్రజల ఆరోగ్య చైతన్యం కోసం 'ఆరోగ్య సంపద' కార్యక్రమం నిర్వహించారు. పేదలకు తక్కువ ధరల్లో మందులు అందించేందుకు ఐకెపి ఆధ్వర్యంలో 'ప్రాణదాత జనరిక్ మెడికల్ షాప్' ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా వావిలపల్లి జగన్నాథ నాయుడు మాట్లాడుతూ, "పదవీ విరమణ చేసి పదేళ్లు పూర్తవుతున్న ఈ సమయంలో నా జీవన గమనం, ప్రజాసేవా ప్రస్థానాన్ని మిత్రులు, శ్రేయోభిలాషులతో పంచుకోవడం ఆనందంగా ఉంది. ప్రజల ప్రేమ, ఆదరణే నాకు లభించిన గొప్ప పురస్కారం" అని పేర్కొన్నారు.



**నిలిచిపోయే పేరు- నిలిచే సేవ**

ఒక మనిషి సంపాదించిన ఆస్తి అతనితోనే ముగుస్తుందిడ కానీ అతను చేసిన సేవ సమాజంలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. వావిలపల్లి జగన్నాథ నాయుడు అలాంటి సేవామూర్తి. పదవులు మారాయిడ కాలం మారిందిడ కానీ ఆయనలోని సేవా తపన మారలేదు. అందుకే ఆయన జీవితం ఒక వ్యక్తిగత విజయగాథ కాదుడ సమాజానికి అంకితమైన ఒక స్ఫూర్తి ప్రస్థానం. ప్రజాసేవను వృత్తిగా మాత్రమే కాకుండా ప్రవృత్తిగా మలుచుకున్న వావిలపల్లి జగన్నాథ నాయుడు నిజంగా నేటి తరానికి ఆదర్శండ రేపటి తరాలకు మార్గదర్శి.



# నాగవంశ కులాన్ని బీసీ - ఏ కి మార్చాలి

**- నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దు రామారావు**

**-జిల్లా అధ్యక్షుడిగా మొఖర వెంకట మల్లేశ్వరరావు - ఘనంగా కార్యవర్గ ప్రమాణస్వీకారం**









పాతపట్నం: అత్యంత వెనకబాటుతనాన్ని అనుభవిస్తున్న నాగవంశ కులాన్ని బీసీ డి నుండి బిసి కేటగిరీకి మార్చాలని నాగవంశ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దు రామారావు కోరారు. నాగ వంశ సంక్షేమ సంఘం జిల్లా నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం ఇక్కడ ఘనంగా జరిగింది. స్థానిక పాతపట్నం శ్రీ నీలమణి దుర్గ గుడి వద్ద సప్తగిరి కళ్యాణ మండపంలో నాగంవశం సంక్షేమ సంఘం అధ్యక్షులు మొకర వెంకట మల్లేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. పాతపట్నం, కోరసవాడ, కాగువాడ, సిది, రొంపి వలస, రొమధళ,చాకిపిల్లి ధర్మ లక్ష్మీపురం మెలియాపుట్టి తదితర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున నాగ వంశ కులస్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా నాగంవశం సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన నాగవంశం కులం ప్రభుత్వానికి నాగవంశ కులస్తుల వెనకబాటుతనాన్ని తెలియజేసి ప్రస్తుతం బీసీ డీలో ఉన్న నాగవంశకులాన్ని, బీసీఏ లో చేర్చేందుకు కృషి చేస్తానని అన్నారు. ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీ మ్యానిఫెస్టోలో కూడా ఈ అంశాన్ని పొందుపరిచిన విషయాన్ని కూడా ప్రభుత్వానికి గుర్తు చేస్తామని, కుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని రామారావు స్పష్టం చేశారు. కార్పొరేషన్ డైరెక్టర్ మద్దు రామారావు, బోను వెంకటరమణ తెలిపారు. నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. జిల్లా అధ్యక్షులుగా మొఖర వెంకట మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా నల్లి రాజారావు, కోశాధికారిగా బోనుల ప్రసాదు, ఆలయ కమిటీ చైర్మన్ అక్కంధర సన్యాసిరావు, ఎంఈఓ ఎంవి రమణ, మద్దు తాతయ్య మాస్టారు, నల్లి లక్ష్మణరావు, పాతపట్నం ప్రభుత్వ హాస్పిటల్ మాజీ చైర్మన్ శ్రీమతి నెల్లి సుజాత, న్యాయవాది కొండాల సూర్య, సర్పంచులు కాళ్ల సింహాచలం, రాజారావు ,కే అప్పారావు, జిల్లా మహిళా అధ్యక్షులు కార్యదర్శి అవనాపు లత, బోను లక్ష్మి ,గణపతి ఆదినారాయణ, బోను వెంకటరమణ ,కనకల కర్రెన్న, కర్రి లక్ష్మీనారాయణ, అమర జనార్ధన్ రావు ,మద్దిలశంకర్రావు మాస్టారు, మాజీ ఎంపీటీసీ కనకల నారాయణరావు, ఎంపీటీసీ కొండాల ఎరకయ్య , మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొండాల రామారావు,కంటు భుక్త రాజు,పొడుగు శ్రీను, జరజాపు రాజారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బోనీ రాజేశ్వరరావు నల్లి అప్పలనాయుడు మాస్టర్, కొన్ని సూరి ప్రకాష్, బుచ్చిబాబు వ్యవహరించారు. సమావేశానికి పెద్ద ఎత్తున అన్ని పంచాయతీల నుంచి సుమారు 300 సభ్యులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఈశ్వరరావు వ్యాఖ్యలు ఖండనీయం

**-సీఐటీయూ నేతల ఆగ్రహం - శ్యాం పిస్టన్స్ కార్మికుల సమస్యలపై స్పందించకుండా యాజమాన్యానికి మద్దతు ఇస్తున్న ఎమ్మెల్యే**

**-కార్మికుల హక్కుల కోసం సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తోంది-సీఐటీయూ పోరాటాల వల్ల ఏ పరిశ్రమ మూతపడలేదని స్పష్టీకరణ**

**- కార్మిక వ్యతిరేక విధానాలే పరిశ్రమల సమస్యలకు కారణమని విమర్శ**




నవతరం రణస్థలం, జూన్ 15:
ఎచ్చెర్ల నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు సీఐటీయూపై చేసిన వ్యాఖ్యలను సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పి. తేజేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు సి. హెచ్. అమ్మన్నాయుడు, జిల్లా కార్యదర్శి ఎన్.వి. రమణతో పాటు పలు కార్మిక సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. సోమవారం పైడిభీమవరం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, శ్యాం పిస్టన్స్ ప్లాంట్-2లో 30 ఏళ్ల సేవ పూర్తయిందనే కారణంతో 140 మంది కార్మికులను బలవంతంగా తొలగించారని, దీనిని ప్రశ్నించిన ఏడుగురు యూనియన్ నాయకులను కూడా అక్రమంగా విధుల నుంచి తొలగించారని ఆరోపించారు. గత ఎనిమిదేళ్లుగా వేతనాలు పెంచకపోవడంతో పాటు, పలుమార్లు యాజమాన్యానికి వినతిపత్రాలు అందజేసినా సమస్యలు పరిష్కరించలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పరిశ్రమ ముందు ధర్నా నిర్వహిస్తే, పరిశ్రమను మూసివేయడానికే ఆందోళన చేస్తున్నారంటూ ఎమ్మెల్యే వ్యాఖ్యానించడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నాలుగు సార్లు ఎమ్మెల్యేను కలిసి విజ్ఞప్తి చేసినా స్పందించలేదని, ఇప్పుడు యాజమాన్యానికి అనుకూలంగా మాట్లాడటం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఎచ్చెర్ల, రణస్థలం పారిశ్రామిక ప్రాంతాల్లో సీఐటీయూ పోరాటాల ఫలితంగానే పలు పరిశ్రమల్లో కార్మికులకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, గ్రాట్యుటీ, చట్టబద్ధ సెలవులు, వేతన ఒప్పందాలు వంటి హక్కులు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. సీఐటీయూ పోరాటాల వల్ల ఏ పరిశ్రమ మూతపడిందో బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను దెబ్బతీస్తున్నాయని ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ, కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్న సీఐటీయూపై విమర్శలు చేయడం హాస్యాస్పదమని అన్నారు. ఈ సమావేశంలో శ్యాం పిస్టన్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎం. అప్పలనర్సయ్య, ప్రధాన కార్యదర్శి గొర్లె కిరణ్, బి. తోటయ్య, ఎస్. రామారావు, ఈశ్వరరావు, ఫ్రింజ్ ల్యాబొరేటరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్. లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

**-మొదటి బ్యాచ్ యోగా శిక్షణ ముగింపు కార్యక్రమంలో విభూది సూరిబాబు**

**-యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచన- యోగా గురువు సురేంద్రకు ఘన సన్మానం**

**- ప్రాణాయామం, యోగాసనాలతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు- అభ్యాసకులు ఉత్సాహంగా శిక్షణ పూర్తి**




నవతరం శ్రీకాకుళం, జూన్ 15:
యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఏపీ కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ విభూది సూరిబాబు అన్నారు. జడ్పీ సమీపంలోని అంబేద్కర్ సామాజిక భవనంలో నిర్వహిస్తున్న యోగా శిక్షణా శిబిరం మొదటి బ్యాచ్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా యోగా గురువు సురేంద్రను నిర్వాహకులతో కలిసి ఘనంగా సన్మానించి, ఆయన సేవలను కొనియాడారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ఇందుకు సమాజంలో ఎంతో మంది నిదర్శనంగా నిలిచారని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు.
స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావడం ఆనందంగా ఉందని సూరిబాబు పేర్కొన్నారు. యోగా గురువు సురేంద్ర మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ యోగా నేర్చుకుని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని పిలుపునిచ్చారు. ప్రతిరోజూ ప్రాణాయామం, యోగాసనాలు చేయడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్. సుధాకరరావు, గంగ ఎర్రా, ఎస్. శ్రీనివాసరావు, కమల, కుమార్, ఆర్.పీ. జయ, ఆర్.పీ. సుజాత, ప్రమీల, పద్మ తదితరులు పాల్గొన్నారు

# ఐఐటి సంస్థకు ఎంపికయిన ముగ్గురు ఆణిముత్యాలు.

**- హెచ్.ఎం.పిట్ట గంగన్న అభినందన.**







నవతరం న్యూస్ ప్రతినిధి టెక్కలి.
జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల దండుగోపాలపురము నకు చెందిన విద్యార్థినిలు 2025-26ఎస్. ఎస్. సి. పరీక్షల్లో మద్దెల.రమ్య 581, దాసరి.లహరి 579,చక్క.శరణ్య 577, మార్కులు సాధించి ,రమ్య, లహరిలకు ఐఐటీ ఆర్ కె వాలీ ఇడుపులపాయ క్యాంపస్ నందు, చక్క.శరణ్య ఐఐటి శ్రీకాకుళము క్యాంపస్ నందు సీట్లు పొందారు. అని ప్రధానోపాధ్యాయులుపిట్ట.గంగన్న తెలిపారు . ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఐఐఐటీ విద్యాసంస్థ మంచి ప్రఖ్యాత సంస్థ అని అందులో మన పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినిలు సీట్లు పొందటం గొప్ప విశేషం అని అన్నారు. అలాగే చెట్లతాండ్రకు చెందిన చెక్క.రామారావు గారి ముగ్గురమ్మాయిలు మన పాఠశాలలో చదివి ఆ ముగ్గురు ఐఐటీ సీట్లు సంపాదించడం గొప్ప విశేషంగా భావిస్తున్నానని , ఒకే కుటుంబం నుంచి ముగ్గురు అక్కచెల్లెల్లు సీట్లు సాధించటం పట్ల. మా యొక్క అభినందనలు తెలియజేయుచున్నామని, వీరు అక్కడ కూడా మరింత బాగా చదివి మా పాఠశాలకు ,వారి తల్లితండ్రులకు పేరుతేవాలని వారు ఉన్నత స్థాయిలో స్థిరపడాలని కోరారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భాస్కరరావు, తిరుపతిరావు, జె.శ్రీనివాసరావు, సూర్యప్రకాష్, నాగేశ్వరరావు, బి.శ్రీనివాసరావు, అన్నాజీ, శారదాంబ, లక్ష్మీనారాయణ, మురళీధర రాజు, రాము, శ్రీధర్, విజయలక్ష్మి, లక్ష్మన్నాయుడు, కొర్లాపు.శ్రీనివాసరావు, లక్ష్మణమూర్తి,నారాయణరావు డి.శ్రీనివాసరావు, దయాసాగర్, శ్రీధర్, మార్కండేయులు సి ఆర్ పి గిరి మరియు పాఠశాల కమిటీ సభ్యులు ఎంపికైన విద్యార్థినీలకు వారి తల్లిదండ్రులను అభినందనలు తెలిపారు

# స్టీల్ ప్లాంట్ దుర్ఘటనపై డీసీసీ అధ్యక్షుడు సనపల అన్నాజీరావు విచారం

**- కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని ఆరోపణ**

**-సిబ్బంది కొరత, నిర్వహణ లోపాలపై ఆందోళన**

**- స్టీల్ ప్లాంట్‌ను అస్థిరపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శ**

**- మృతుల కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని డిమాండ్**




నవతరం శ్రీకాకుళం, జూన్ 15:
విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన ఘోర ప్రమాదంలో కార్మికులు మృతి చెందడం పట్ల జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు సనపల అన్నాజీరావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటన కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఎక్కువ మంది పనిచేయాల్సిన ప్రదేశాల్లో తక్కువ మంది సిబ్బందితో పనులు నిర్వహించడం, కార్మికులపై అధిక పనిభారం మోపడం వంటి కారణాలే ప్రమాదాలకు దారితీస్తున్నాయని ఆరోపించారు. యంత్రాల నిర్వహణ, మరమ్మతుల విషయంలో సరైన చర్యలు తీసుకోకపోవడం, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల స్థానాల్లో కొత్త నియామకాలు చేపట్టకపోవడం వల్ల సంస్థలో అనేక లోపాలు ఏర్పడ్డాయని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం సంస్థను బలహీనపరిచే చర్యలకు పాల్పడుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆయన విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే విధానాలను కాంగ్రెస్ పార్టీ ఎప్పటి నుంచో వ్యతిరేకిస్తోందని గుర్తుచేశారు.
స్టీల్ ప్లాంట్‌లోని అన్ని విభాగాల్లో సరైన నిర్వహణ, భద్రతా చర్యలు చేపట్టకపోవడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ తరపున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధిత కుటుంబాలకు తగిన పరిహారం, న్యాయం అందించి అన్ని విధాలా ఆదుకోవాలని సనపల అన్నాజీరావు డిమాండ్ చేశారు

# అ'పూర్వ'కలయిక

1994-95 సవంత్సరశీ లో ఎచ్చెర్ల ప్రభుత్వ పాఠశాల లో చదివిన పూర్వ విద్యార్థులంతా ఆదివారం పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. మూడు దశాబ్దాల క్రితం నాటి ఊసులు, జ్ఞాపకాలను కలబోసుసుకున్నారు. వివిధ హోదాలలో ఉన్న తామంతా సమాజకోసం కృషి చేయాలనీ సంకల్పించుకున్నారు. ఇందుకోసశీ, బ్యాంక్ ఖాతా ప్రారంభించి, ప్రతీ ఒక్కరూ నెలకు వంద రూపాయలు చొప్పున జమచేయాలనుకున్నారు. అంతే కాకుండా ఎవరి స్థాయిని అనుసరించి వారు సహాయం చేయవచ్చని కూడా అనుకున్నారు. సామాజిక స్ఫూర్తి తో కలసి పని చేద్దామని ప్రతిన చేసుకున్నారు. పాత గుర్తులను తలచుకొని, కొత్త ప్రణాళికలు వేసుకొని ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమం లో నలభై మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరంతా వివిధ హోదాలలో ఉన్నారు.



# 'దువ్వాడ దెబ్బ'కు తలలు పట్టుకున్న టీడీపీ నేతలు

**: జీడిపప్పు సెస్‌పై డైవర్షన్ పాలిటిక్స్ -జీడిపప్పుపై 1% మార్కెట్ సెస్ రద్దు చేయాలన్న దువ్వాడ శ్రీధర్ ప్రశ్నకు ప్రభుత్వం నుంచి మౌనమే సమాధానం**

**-సమస్యను పక్కదారి పట్టించేందుకే 'బ్రాండ్ అంబాసిడర్' తెరపైకి - యాజమాన్యాల ఆగ్రహం -త్వరలో సీఎం చంద్రబాబుతో జీడి వ్యాపారుల భేటీ ఏర్పాటు చేస్తామంటున్న పలాస టీడీపీ పెద్దలు**

పలాస: జీడిపప్పుపై రాష్ట్ర ప్రభుత్వం జీఎస్టీతో పాటు అదనంగా ఒక శాతం మార్కెట్ సెస్ విధించడం పట్ల జీడి పరిశ్రమ భవిష్యత్తులో తీవ్ర సంక్షోభంలో పడబోతుందన్న ఆందోళన జీడి పరిశ్రమల యాజమాన్యాలు వ్యక్తం చేస్తున్నాయి. 'ఒకే దేశం-ఒకే పన్ను' నినాదంతో కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని అమలు చేస్తుంటే, ఉద్దానం ప్రాంతానికి జీవనాడి అయిన పలాస జీడి పరిశ్రమపై మాత్రం 'జీఎస్టీకి తోడు సెస్', 'ఒకే సరుకుపై రెండు ఇ-ట్రాన్స్‌పోర్ట్ పర్మిట్లు' అంటూ డబుల్ భారం మోపుతుండడంతో పరిశ్రమ మనుగడే ప్రశ్నార్థకంగా మారిందని ఈ ప్రాంతంలో చేసిన క్షేత్రస్థాయి పరిశోధనలో వెల్లడైంది.

శ్రీకాకుళం జిల్లా పలాస, కాశీబుగ్గ, మందస, సోంపేట ప్రాంతాల్లో సుమారు 400కు పైగా చిన్న, మధ్య తరహా జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయి. వీటిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మంది కార్మికులు, రైతులు ఆధారపడి జీవిస్తున్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న విధానం ప్రకారం జీడి వ్యాపారులు రైతుల వద్ద నుంచి జీడిపిక్కలను కొనుగోలు చేసి పరిశ్రమలకు తరలించే సమయంలో వ్యవసాయ ఉత్పత్తిగా ఒకసారి ఆన్‌లైన్ ఇ-ట్రాన్స్‌పోర్ట్ పర్మిట్ తీసుకోవాలి. ఆ పిక్కలను ప్రాసెసింగ్ చేసి జీడిపప్పుగా మార్చిన తర్వాత అదే సరుకును మార్కెట్‌కు, ఎగుమతులకు తరలించేందుకు 'హవషీఅఖ్రితీఎ ఞఖ్శ్రీవం' పేరుతో మళ్లీ రెండోసారి ఞ×చీఖజుణ ఇ-ట్రాన్స్‌పోర్ట్ పర్మిట్ తప్పనిసరి చేశారు. రూపం మారినా సరుకు ఒక్కటే అయినప్పుడు రెండు సార్లు పర్మిట్ ఎందుకని, దీనివల్ల సమయం వృథాతో పాటు రవాణా ఖర్చులు, నిర్వహణ భారం రెట్టింపు అవుతోందని యజమానులు వాపోతున్నారు.

ఇక పన్నుల విషయంలో అసలు వివాదం మొదలైంది. దేశమంతా జీఎస్టీ ఒకటే అమలవుతుండగా, పలాసలో మాత్రం జీడిపప్పుపై జీఎస్టీతో పాటు అదనంగా 1% మార్కెట్ సెస్ వసూలు చేస్తున్నారు. పలాసకు కూతవేటు దూరంలో ఉన్న ఒడిశా రాష్ట్రంలోని పర్లాకిమిడి, గారబంద ప్రాంతాల్లో జీడి పరిశ్రమలకు జీఎస్టీ మినహా ఇతర సెస్‌లు, అదనపు పన్నులేమీ లేవు. దీంతో పలాస జీడిపప్పు ధర ఒడిశా సరుకుతో పోలిస్తే కిలోకు రూ.40 నుంచి రూ.50 వరకు అధికంగా ఉంటోంది. "సరిహద్దు దాటితే పన్ను లేదు, ఇక్కడెందుకు? ఈ వ్యత్యాసంతో జాతీయ మార్కెట్‌లో మేం పోటీ పడలేకపోతున్నాం. క్రమంగా బల్క్ ఆర్డర్లు ఒడిశాకు వెళ్లిపోతున్నాయి" అని పలాస జీడి పరిశ్రమల సంఘం ప్రతినిధులు తెలిపారు.

ఈ అన్యాయంపై వైఎస్‌ఆర్‌సీపీ సీనియర్ నేత, పలాస పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దువ్వాడ శ్రీధర్ బాబు తీవ్రంగా స్పందించారు. జీడిపప్పుపై మార్కెట్ సెస్ ఒక శాతం ఉపసంహరించాలని, డబుల్ పర్మిట్ విధానం రద్దు చేయాలని కోరుతూ ఆయన పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషతో పాటు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రికి, ముఖ్యమంత్రి కార్యాలయానికి లేఖలు రాశారు. "లక్షలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న ఉద్దానం వెన్నెముక అయిన జీడి పరిశ్రమను కాపాడాలంటే అనవసర పన్ను భారాలు, నిబంధనలు తొలగించాలి. జీడిపిక్కల కొనుగోలు సమయంలో జారీ చేసిన పర్మిట్‌నే జీడిపప్పు రవాణాకు కూడా వర్తింపజేయాలి" అని ఆ లేఖలో స్పష్టంగా పేర్కొన్నారు.

అయితే జీడిపప్పుపై మార్కెట్ సెస్ ఒక శాతం ఉపసంహరించాలన్న దువ్వాడ శ్రీధర్ ప్రశ్నకు సమాధానం చెప్పకుండా టీడీపీ నేతలు మౌనం వహించారు. దీంతో జీడి పరిశ్రమ యాజమాన్యాల నుంచి స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీషపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. "సెస్ ఎత్తేయమని అడిగితే సమాధానం లేదు. పక్క రాష్ట్రంలో లేని సెస్ మనకెందుకు అంటే నోరు మెదపరు. ప్రజా సమస్యలపై మాట్లాడకుండా దాటవేత ధోరణి అవలంబిస్తున్నారు" అని యాజమాన్యాలు బాహాటంగానే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

ఈ వ్యతిరేకతతో అప్రమత్తమైన పలాస టీడీపీ పెద్దలు నష్ట నివారణ చర్యలకు దిగారు. 'దువ్వాడ దెబ్బ'కు ఇరుకునపడిన నేపథ్యంలో సమస్యను డైవర్షన్ చేసేందుకు పలాస జీడిపప్పుకు బ్రాండ్ అంబాసిడర్ కల్పిస్తామంటూ జీడి వ్యాపారులతో చర్చలు ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఎమ్మెల్యే గౌతు శిరీష భర్త వెంకన్న చౌదరి ఇటీవల పలాసలో జీడి వ్యాపారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. "అమెరికా వంటి దేశాలలో పలాస జీడిపప్పుకు అంతర్జాతీయ మార్కెట్ పెంచేందుకు బ్రాండ్ అంబాసిడర్‌ను తెప్పిస్తాం.



త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో జీడి వ్యాపారులకు భేటీ ఏర్పాటు చేస్తాం. ఎగుమతి ఒప్పందాలు కుదిరేలా చూస్తాం" అని ఆయన వ్యాపారులకు హామీ ఇచ్చారు.

దువ్వాడ శ్రీధర్ బాబా ఎఫెక్ట్ గట్టిగా తగలడంతో 'ప్లేటు మార్చి' పలాస జీడిపప్పుకు బ్రాండ్ అంబాసిడర్ తెప్పిస్తామంటూ ఎమ్మెల్యే వర్గీయులు చేస్తున్న హడావుడిపై జీడి పరిశ్రమ యజమానులు అంతర్గతంగా తీవ్రంగా చర్చించుకుంటున్నారు. "అసలు సమస్య 1% సెస్, డబుల్ పర్మిట్. వాటిని పరిష్కరించకుండా అమెరికా, అంబాసిడర్ కబుర్లు చెబితే ఎలా? ముందు పన్ను భారం తగ్గించండి, బ్రాండింగ్ తర్వాత. అసలు సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నం చేయొద్దు. మాకు కావాల్సింది ప్రచార ఆర్భాటాలు కాదు, ఉపశమనం" అని జీడి పరిశ్రమల సంఘం నేతలు తెగేసి చెబుతున్నారు.

ఈ వివాదంపై పలాస వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్ల శ్రీనివాసరావు హడావుడిగా ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి "కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు, అగ్రికల్చర్ ప్రొడ్యూస్ మార్కెటింగ్ కమిటీ యాక్ట్ ప్రకారమే 1% మార్కెట్ సెస్ వసూలు చేస్తున్నాం. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ తప్పేమీ లేదు" అని వివరణ ఇచ్చారు. కానీ 'పక్క రాష్ట్రంలో లేని సెస్ ఇక్కడెందుకు' అనే దువ్వాడ శ్రీధర్ బాబు ప్రధాన ప్రశ్నకు మాత్రం చైర్మన్ వద్ద సమాధానం లేదు.

ఒకవైపు ఉత్పత్తి వ్యయం పెరగడం, మరోవైపు ఒడిశా నుంచి పోటీ ఎదురుకావడంతో పలాసలోని 400కు పైగా చిన్న, మధ్య తరహా జీడి పరిశ్రమలు సంక్షోభంలో కూరుకుపోతున్నాయి. దీంతో వీటిపై ఆధారపడిన లక్షలాది మంది కార్మికులు, రైతుల జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం వెంటనే స్పందించి డబుల్ పర్మిట్ విధానం, అదనపు మార్కెట్ సెస్‌ను రద్దు చేసి పరిశ్రమకు ఊరట కల్పించాలని, లేని పక్షంలో రోడ్డెక్కి ఆందోళన బాట పడతామని జీడి పరిశ్రమ వర్గాలు హెచ్చరిస్తున్నాయి. దువ్వాడ దెబ్బకు తలలు పట్టుకున్న టీడీపీ నేతలు బ్రాండ్ అంబాసిడర్ పేరుతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, అసలు సమస్య పరిష్కారం కాకుండా ప్రచార ఆర్భాటాలు చేస్తే సహించేది లేదని వారు స్పష్టం చేస్తున్నారు.

# పారదర్శక ఓటరు జాబితాల కోసం ఎస్ఐఆర్‌కు సహకరించాలి

**-ప్రజాస్వామ్య పరిరక్షణకు స్వచ్ఛమైన ఓటరు జాబితా అవసరం: మాదారపు వెంకటేష్**

**-జూన్ 15 నుంచి జూలై 14 వరకు ప్రత్యేక సమగ్ర సర్వే- అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే ప్రధాన లక్ష్యం**

**- బీఎల్‌వోలు, బీఎల్‌ఏలకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి- నకిలీ, డబుల్, మృతుల పేర్ల తొలగింపుతో హెల్తీ ఓటర్ లిస్ట్**

నవతరం శ్రీకాకుళం, జూన్ 15: పారదర్శకమైన ఓటరు జాబితా ప్రజాస్వామ్య పరిరక్షణకు గొప్ప బలమని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రజలు సహకరించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదారపు వెంకటేష్ కోరారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జూన్ 15 నుంచి జూలై 14 వరకు రాష్ట్రవ్యాప్తంగా "స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటుకు అర్హులైన ప్రతి భారతీయుడికి ఓటు హక్కు అందేలా చూడడం, మృతులు, డబుల్ ఎంట్రీలు, వలస వెళ్లిన వారి పేర్లను తొలగించడం, 18 ఏళ్లు నిండిన కొత్త ఓటర్లను చేర్చడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ స్థాయి కార్యకర్తలకు అవగాహన కల్పిస్తూ సమావేశాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్‌వోలు), రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్‌ఏలు) ప్రతి ఇంటిని సందర్శిస్తారని తెలిపారు. వారు అందించే ఎన్యూమరేషన్ ఫారాలను ప్రజలు సక్రమంగా పూర్తి చేసి, ఫోటో జత చేసి, నిర్ణీత గడువులోగా బీఎల్‌వోలకు అందించాలని సూచించారు. ఫారం సమర్పించిన అనంతరం బీఎల్‌వో సంతకంతో కూడిన డిక్లరేషన్ కాపీని భద్రపరచుకోవాలని సూచించారు. స్వచ్ఛమైన, పారదర్శకమైన ఓటరు జాబితాల ద్వారా ప్రజాస్వామ్య విలువలు




బలోపేతం అవుతాయని, ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేసే ప్రభుత్వాల ఏర్పాటుకు ఇది దోహదపడుతుందని మాదారపు వెంకటేష్ పేర్కొన్నారు. ప్రజలంతా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు

# వృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే.హరిబాబు**

శ్రీకాకుళం, జూన్ 15: సమాజంలో నిరాదరణకు గురవుతున్న వృద్ధులకు, మహిళలకు అండగా నిలిచి వారికి చట్టపరమైన న్యాయం అందించడంతో పాటు మౌలిక వసతులు కల్పించడమే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ముఖ్య ఉద్దేశమని ఆ సంస్థ కార్యదర్శి కే.హరిబాబు పేర్కొన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సూచనలతో సోమవారం ఆయన స్థానిక కలెక్టరేట్ సమీపంలో ఉన్న 'సి.వి.నాగజ్యోతి ఆనంద నిలయం' (వృద్ధాశ్రమం), ప్రభుత్వ స్టేట్ హోమ్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆనంద నిలయంలోని వృద్ధులతో మాట్లాడి వారి మౌలిక వసతులు, వైద్యం, భోజన సదుపాయాలు మరియు పింఛన్ల స్థితిగతులపై ఆరా తీశారు. పింఛన్లు రాని వృద్ధుల పత్రాలను పరిశీలించి, సంబంధిత విభాగాలతో మాట్లాడి త్వరలోనే న్యాయం చేస్తామని, అలాగే తమ సొంత ఊర్లకు వెళ్లాలనుకునే వృద్ధులను వారి బంధువుల చెంతకు చేర్చేందుకు ఈ సంస్థ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ధీమా కల్పించారు. అనంతరం స్టేట్ హోమ్‌ను సందర్శించిన కార్యదర్శి హరిబాబు, అక్కడ ఆశ్రయం పొందుతున్న మహిళల ఆరోగ్యం, ఆహారం, పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలించారు. నివాసితులు బయటకు వెళ్లే సమయంలో తప్పనిసరిగా 'మూవ్‌మెంట్ రిజిస్టర్'లో వివరాలను నమోదు చేయాలని, క్రమశిక్షణ విషయంలో ఏ చిన్న పొరపాటుకూ తావుండకూడదని స్పష్టం చేశారు. వృద్ధుల పింఛన్ల పురోగతిపై పూర్తి నివేదికను తమ సంస్థకు సమర్పించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆనంద నిలయం ఇన్‌ఛార్జ్ ఎస్.సాయి సుధాకర్, జిల్లా బాలల సంరక్షణ అధికారి కె.వి.రమణ, స్కూల్ అసిస్టెంట్ ఎస్.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





# మహాకవి యుగకర్త శ్రీ శ్రీ వర్ధంతి సందర్భంగా నివాళులు.

**- అతని కవిత్వం ఏ కాలానికైనా సజీవం.**

(ఆమదాలవలస - )

అతి ప్రసిద్ధమైన కావ్యం "మహాప్రస్థానం" రచయిత మహాకవి యుగకర్త శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీ శ్రీ) వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆముదాలవలసలో, ఉపాధ్యాయులు, విద్యార్థులు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఇందులోభాగముగా తెలుగు ఉపాధ్యాయులు పి.మోహనరావు మాట్లాడుతూ కర్షకులు, కార్మికుల చెమట బిందువులను అక్షరాయుధాలుగా చేసి కవిత్వం అల్లి, ప్రజానీకాన్ని చైతన్యవంతం చేసిన విప్లవ రచయిత శ్రీ శ్రీ గొప్ప సామాజికవేత్తని కొనియాడారు. అతని కవిత్వం ఏ కాలానికైనా సజీవమని, ప్రజానీకం అతని రచనల నుండి స్ఫూర్తిని పొందాలని పిలుపునిచ్చారు. ఇన్చార్జ్ హెడ్మాస్టర్ పైల రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో, ఐతమ్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఎన్సిసి శిక్షణ కార్యక్రమంలో సిల్వర్ మెడల్ పొందిన 9వ తరగతి విద్యార్థిని ఎం.సాద్వికను, ఎన్సిసి అధికారులు బి శరత్ కుమారి, పి.మోహనరావు, తదితరులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఫుల్‌టైం విధులు కల్పించాలి

**-ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుకు పార్ట్‌టైం పీటీఐల వినతి**


**-సమగ్ర శిక్షలో పనిచేస్తున్న పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ల విజ్ఞప్తి**

**- కళలు, వ్యాయామ విద్యకు పూర్తి స్థాయి బోధన అవసరమని అభిప్రాయం**

**- సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్న ఎమ్మెల్సీ**

**- యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం**

నవతరం శ్రీకాకుళం, జూన్ 15: సమగ్ర శిక్షలో పనిచేస్తున్న పార్ట్‌టైం ఫిజికల్ ట్రైనింగ్ ఇన్‌స్ట్రక్టర్లకు (పీటీఐలు) పూర్తి పని వేళలు (ఫుల్‌టైం) కల్పించాలని కోరుతూ ఉత్తరాంధ్ర శాసనమండలి సభ్యుడు, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావుకు పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు వినతిపత్రం సమర్పించారు. శనివారం




సాయంత్రం స్థానిక బృందావన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీని కలిసి తమ సమస్యలను వివరించారు. పాఠశాలల్లో విద్యార్థులకు కళలు, వ్యాయామ విద్యను పూర్తిస్థాయిలో అందించాలంటే పార్ట్‌టైం విధానానికి బదులుగా ఫుల్‌టైం విధులు కల్పించడం అవసరమని పేర్కొన్నారు. వినతిపై స్పందించిన ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఈ అంశాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఫుల్‌టైం విధులు కల్పించే అవకాశాలపై చర్చించి తగిన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ల యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిగిలిపల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బుడుమూరు రమేష్, రాష్ట్ర కన్వీనర్ గుడివాడ కామేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ వై. సత్యనారాయణ, పి. తారకేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు చీర రాజేశ్వరి, సభ్యులు వేణుకుమారి, అనురాధ, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

# స్వేచ్ఛ? భద్రత? బెయిల్ సూత్రాలపై రాజ్యాంగ చర్చ

ఒక వ్యక్తి నేరం చేసినట్లు ఇంకా కోర్టులో రుజువు కాకముందే సంవత్సరాల తరబడి జైలులో ఉండాల్సి వస్తే దాన్ని న్యాయం అనాలా? లేక దేశ భద్రత కోసం అవసరమైన చర్య అనాలా? ఒకవైపు వ్యక్తిగత స్వేచ్ఛను కాపాడాలని రాజ్యాంగం చెబుతోంది. మరోవైపు ప్రజల భద్రత, దేశ సమగ్రతను రక్షించడం ప్రభుత్వ బాధ్యత. ఈ రెండు విలువల మధ్య సమతుల్యత ఎలా సాధించాలి అనే ప్రశ్న నేడు భారత న్యాయవ్యవస్థ ముందున్న అత్యంత ముఖ్యమైన చర్చగా మారింది.

భారత రాజ్యాంగంలోని అధికరణం ఇరవై ఒకటి ప్రతి వ్యక్తికి జీవించే హక్కు, స్వేచ్ఛగా జీవించే హక్కు కల్పిస్తుంది. చట్టబద్ధమైన ప్రక్రియ లేకుండా ఎవరి స్వేచ్ఛనూ హరించరాదని స్పష్టం చేస్తుంది. అదే సమయంలో అధికరణం ఇరవై రెండు కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ముందస్తు నిర్బంధాన్ని అనుమతిస్తుంది. అంటే రాజ్యాంగం వ్యక్తిగత స్వేచ్ఛను కాపాడుతూనే, దేశ భద్రత కోసం కొన్ని పరిమిత అధికారాలను కూడా ప్రభుత్వానికి ఇచ్చింది. ఇక్కడే స్వేచ్ఛకు, భద్రతకు మధ్య సమతుల్యత అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది.


ముందస్తు నిర్బంధం అంటే నేరం జరిగిన తర్వాత విధించే శిక్ష కాదు. ఒక వ్యక్తి చర్యల వల్ల భవిష్యత్తులో ప్రజా శాంతికి లేదా దేశ భద్రతకు ముప్పు ఏర్పడవచ్చని భావించినప్పుడు తీసుకునే ముందుజాగ్రత్త చర్య. దీని ఉద్దేశం నేరాన్ని శిక్షించడం కాదు, నేరాన్ని నివారించడం. అయితే ఈ అధికారం దుర్వినియోగమైతే నిర్దోషుల స్వేచ్ఛకు భంగం కలిగే ప్రమాదం ఉంటుంది. అందుకే న్యాయస్థానాలు ఎప్పటికప్పుడు దీనిపై అప్రమత్తంగా ఉంటున్నాయి.

భారతీయ నాగరిక భద్రతా సంహిత2023 ప్రకారం ప్రజా శాంతి పరిరక్షణ కోసం పోలీసులకు కొన్ని పరిమిత ముందస్తు నిర్బంధ అధికారాలు ఇవ్వబడ్డాయి. నేరాల నివారణ, ప్రభుత్వ ఆస్తుల రక్షణ, చట్టబద్ధ ఆదేశాల అమలు వంటి లక్ష్యాల కోసం ఈ అధికారాలను వినియోగించవచ్చు. అలాగే జాతీయ భద్రతా చట్టం దేశ భద్రతకు ముప్పుగా భావించిన వ్యక్తులను నిర్దిష్ట కాలం వరకు నిర్బంధించే అవకాశాన్ని కల్పిస్తుంది. మరోవైపు అక్రమ కార్యకలాపాల నిరోధక చట్టంలోని కఠిన నిబంధనల వల్ల కొన్నిసార్లు నిందితులు విచారణ పూర్తికాకముందే సుదీర్ఘకాలం జైలులో ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

ఇక్కడ ఒక సాధారణ పౌరుడు అడిగే ప్రశ్న ఏమిటంటే "నేరం రుజువు కాకముందే ఒక వ్యక్తి సంవత్సరాల పాటు జైలులో ఉంటే, అతని స్వేచ్ఛకు జరిగిన నష్టాన్ని ఎవరు భర్తీ చేస్తారు?" ఇదే ప్రశ్న న్యాయస్థానాల ముందూ తరచూ వినిపిస్తోంది. ఎందుకంటే న్యాయం అంటే కేవలం నేరస్తులను శిక్షించడం మాత్రమే కాదు; నిర్దోషులను రక్షించడం కూడా.

తెలుగు రాష్ట్రాల్లో అమలులో ఉన్న ప్రమాదకర కార్యకలాపాల నిరోధక చట్టాలు గూండా చర్యలు, మాదకద్రవ్య వ్యాపారం, భూకబ్జాలు, సైబర్ నేరాలను నియంత్రించేందుకు ఉపయోగించబడుతున్నాయి. అయితే ప్రతి నేరాన్ని ప్రజా శాంతికి ముప్పుగా చిత్రీకరించి ముందస్తు నిర్బంధానికి పాల్పడకూడదని న్యాయస్థానాలు స్పష్టం చేశాయి. వ్యక్తిగత వివాదం, సాధారణ నేరం, ప్రజా శాంతి భంగం, దేశ భద్రత ఇవన్నీ ఒకటే కాదని పలుమార్లు పేర్కొన్నాయి.

ఈ నేపథ్యంలోనే భారత న్యాయవ్యవస్థలో ఒక ముఖ్యమైన సూత్రం రూపుదిద్దుకుంది. అదే "బెయిల్ సాధారణ నియమం, నిర్బంధం మినహాయింపు." ఈ సూత్రం వెనుక ఉన్న భావన ఏమిటంటే, ఒక వ్యక్తి నేరం చేసినట్లు కోర్టు తుది తీర్పు చెప్పే వరకు అతడిని నేరస్తుడిగా చూడకూడదు. విచారణకు సహకరించే అవకాశం ఉన్నప్పుడు అనవసరంగా స్వేచ్ఛను హరించడం




రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని న్యాయస్థానాలు అభిప్రాయపడ్డాయి.

సుప్రీంకోర్టు అనేక సందర్భాల్లో వేగవంతమైన విచారణ హక్కు కూడా వ్యక్తిగత స్వేచ్ఛలో భాగమేనని పేర్కొంది. విచారణ సంవత్సరాల తరబడి సాగితే, చివరకు వ్యక్తి నిర్దోషిగా తేలినా కోల్పోయిన సమయాన్ని తిరిగి పొందలేడు. అందుకే జైలు శిక్షకు ముందు న్యాయం, విచారణకు ముందు స్వేచ్ఛ అనే అంశాలు ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత ప్రాధాన్యం పొందాయి. అయితే మరోవైపు దేశ భద్రతను కూడా విస్మరించలేము. ఉగ్రవాదం, వ్యవస్థీకృత నేరాలు, దేశ వ్యతిరేక కార్యకలాపాలు, భారీ స్థాయిలో ప్రజా శాంతిని భంగం చేసే చర్యలు వంటి సందర్భాల్లో కఠిన చట్టాల అవసరం ఉందని చాలామంది భావిస్తారు. ఎందుకంటే ప్రజల ప్రాణాలు, దేశ భద్రత కూడా రాజ్యాంగ పరిరక్షణ పొందాల్సిన విలువలే.

అందువల్ల అసలు ప్రశ్న "స్వేచ్ఛా? భద్రతా?" అనేది కాదు. "స్వేచ్ఛను కాపాడుతూ భద్రతను ఎలా నిర్ధారించాలి?" అనేదే నిజమైన ప్రశ్న. ప్రజాస్వామ్యంలో వ్యక్తిగత హక్కులు, ప్రజా ప్రయోజనం, జాతీయ భద్రత ఈ మూడింటి మధ్య సమతుల్యత సాధించినప్పుడే న్యాయం పరిపూర్ణంగా నిలుస్తుంది.

రేపు ఇదే పరిస్థితి మనకు లేదా మన కుటుంబ సభ్యులకు ఎదురైతే మనం ఏమి కోరుకుంటాం? న్యాయమైన విచారణనా? స్వేచ్ఛకు గౌరవమా? లేక భద్రత పేరుతో నిరవధిక నిర్బంధమా? ఈ ప్రశ్నకు సమాధానం వెతికే ప్రయాణమే రాజ్యాంగ ప్రజాస్వామ్యానికి అసలైన బలం.

ధర్మం రక్షిస్తే ధర్మం మనలను రక్షిస్తుంది.

# దేవుడా.! రక్త దాత ఎక్కడా.?

## ప్లీజ్..సెండ్ ఏ బ్లడ్ డోనర్

సార్..
సార్..
మీది ఎ+ రక్తమా..?!
చెప్పండి సార్..
ప్లీజ్ సార్..
కాదయ్యా.?!
నాది బి+

ఇందాక మీరు ఓ పాజిటివ్ అన్నట్టు వినిపించింది
అందుకే అడిగాను సార్..

ఇంతకు..
ఆ కంగారెందుకు
మా బాబు కు అత్యవసరం గా..
రక్తం కావాలి
ఓ+ కావాలి అని
హాస్పిటల్లో చెప్పారు సార్
ఇక్కడ ఉన్న వాళ్లలో
ఎవరికైనా..ఎ+ ఉందేమో అని..
నా ఆశ.
ఉదయం నుంచి..
ప్రతి ఒక్కరినీ..అడుగుతూనే ఉన్నాను సార్.
ఎవరూ దొరకలేదు.
అంటూ..
కళ్ళలో నుంచి వస్తున్న నీళ్ళను తుడుచుకుంటూ..
ఓ ప్రైవేటు ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ వద్ద..
"దేవుడు" ఎవరి రూపం లో.. వస్తాడా.?!
ఓ పాజిటివ్ రక్తం ఇస్తాడా?!
అని
వేచి చూసి
వేచి చూసి..
ఏడ్చి..ఏడ్చి
కళ్ళు ఎర్రగా అయ్యాయి.

బాబు సార్ ది బి పాజిటివ్ రక్తం
మేడం ది ఓ పాజిటివ్ కానీ..
ఆవిడ వద్ద రక్తం తేరుకోలేము
మేడం రక్తం లో.. హీమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉంది.
అంటే ఏంటి మేడం..
అర్థం కాలేదు అనడిగింది నా అర్థాంగి.
ఏమ్ లేదు మేడం
మీ రక్తం లో ఐరన్(ఇనుము) తక్కువగా ఉంది.
మీరు
పాలకూర..పెరుగు..ఖర్జూరం బెల్లం.
కాస్త ఎక్కువగా తింటే..
మీరూ రక్త దానం చేసేలా..
మీ రక్తం పనికి వస్తుంది.

ఇది..ఆదివారం నాడు హైదరాబాద్ లో ఉన్న ఓ ఆసుపత్రి లో..మాకు కనిపించిన హృదయ విదారక సన్నివేశం.

**రక్త దాతల కోసం దీనంగా వెతుకులాట**

అమ్మో..
సూది గుచ్చుతారు.
అబ్బా..ఆ నొప్పి భరించలేం.
ఇలా..
కొన్ని చిన్న చిన్న కారణాల తో..
రక్తం దానం చేసే అసక్తి ఉన్న వారు సైతం..రక్త దాన శిబిరం వైపు అడుగులు వేయటం లేదు.
రక్త దానం చేస్తే..ఎంత గౌరవం ఉంటుందో తెల్సా.?
రెడ్ క్రాస్ వంటి సంస్థల్లో గౌరవ సభ్యత్వం ఇస్తారు.
రాష్ట్ర గవర్నర్ వద్ద..గవర్నర్ కోసం వేచి చూసే వాళ్లలో..ఎవరైనా రెడ్ క్రాస్ సభ్యులు ఉంటే..?వారికే ప్రధమ అవకాశం.
అలాగే..
వివిధ స్వచ్ఛంద సంస్థలు, రక్త దాతల ను ప్రోత్సహించి సందర్భానుసారం గా..రక్త దాన శిబిరం ను నిర్వహిస్తున్నారు.

**ఎందుకు ఈ అనాసక్తి**

మన వాళ్లు ఎవరైనా ఆపద లో ఉండి,వారికి అత్యవసరం గా..రక్తం కావాలి అంటే..
ఎక్కణ్ణు0చి?! తెచ్చి ఇస్తారు.
అదే..
మన వద్ద ..మనం ఇదివరకు రక్త దానం చేసిన బ్లడ్ డోనేషన్ సర్టిఫికట్ ఉంటే.?! రక్త దానం చేసే వాళ్లను పట్టడం సులువు.
ఫలానా వ్యక్తి కి ఫలానా రక్తం అవసరం అని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ లు వైరల్ చేసి కూడా..



**మాచన రఘునందన్**
**9441252121**
**పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తాశిల్దార్ టుబాకో కంట్రోల్ హీరో అవార్డు గ్రహీత**

మనకు కావలసిన రక్త దాతల ను వెతికి పెట్టుకోవచ్చు.
ఏది ఏమైనా..
మనం.. ఏటా కనీసం ఓ 2 సార్లు రక్త దానం చేస్తే..
రెడ్ క్రాస్ ను గానీ.. బ్లడ్ బ్యాంక్ లను కానీ..
గట్టిగా అడిగే ఆకాశం ఉంది.ఉంటుంది.
అంతే తప్ప..
రక్త దానమా.?!
మనకెందుకు..అనే భావన ను మనస్సులో నుంచి తీసేయండి.
ఏ..ఎవరైనా ప్రముఖులు వచ్చి
బాబ్బాబు..కాస్త రక్త దానం చేయవయ్యా.! అని బతిమాలితేనే రక్తం దానం చేస్తారా.?!
హృదయం మనల్ని అడకుండానే ఎలా ఐతే పని చేస్తుందో..
మనం కూడా..రక్త దానం చేయడానికి అడుగు ముందుకు వేస్తే..హీరో అవుతాం.

# ఎమ్మెల్యే గొండు శంకర్‌ను పరామర్శించిన మంత్రి అచ్చెన్నాయుడు

**-శస్త్రచికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితిపై ఆరా**
**- కృష్ణపేటలోని నివాసంలో మర్యాదపూర్వక భేటీ**
**- త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన మంత్రి**
**- పూర్తి ఆరోగ్యంతో ప్రజాసేవలో పాల్గొనాలని సూచన**

నవతరం శ్రీకాకుళం, జూన్ 15:
ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని కృష్ణపేటలోని తన స్వగ్రామంలో విశ్రాంతి తీసుకుంటున్న శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరోగ్య పరిస్థితిని మంత్రి అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్స అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చర్చిస్తూ ధైర్యం చెప్పారు. త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో చురుకైన పాత్ర పోషిస్తున్న గొండు శంకర్ పూర్తి ఆరోగ్యంతో తిరిగి విధుల్లో పాల్గొని ప్రజలకు సేవలందించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆకాంక్షించారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు.



# కార్గిల్ పార్కులో ఘనంగా 'యోగా ఆంధ్ర 2026' వేడుకలు

**-జలవనరుల శాఖ సిబ్బందికి ప్రత్యేక యోగా శిబిరం -ఒత్తిడిని జయించేందుకు యోగా చక్కటి మార్గం: ఎస్.ఇ పొన్నాడ సుధాకర్**






శ్రీకాకుళం, జూన్ 14:
'యోగా ఆంధ్ర 2026' వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీకాకుళం నగరంలోని కార్గిల్ పార్కులో జలవనరుల శాఖ అధికారులు, సిబ్బందికి ప్రత్యేక యోగా శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో జలవనరుల శాఖ, ఆయుష్ శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జలవనరుల శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్.ఇ) పొన్నాడ సుధాకర్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో నిరంతరం విధుల్లో తీరిక లేకుండా గడిపే సిబ్బందికి శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం ఎంతో అవసరమని పేర్కొన్నారు. దానికి యోగా ఒక్కటే అత్యుత్తమ మార్గమని ఆయన అభిప్రాయపడ్డారు.
వంశధార ప్రాజెక్ట్ ఎస్.ఇ గురుగుబెల్లి రామచంద్రరావు మాట్లాడుతూ, ప్రతిరోజూ యోగా సాధన చేయడం వల్ల మానసిక ఏకాగ్రత పెరుగుతుందని, వృత్తిరీత్యా ఎదురయ్యే ఒత్తిడిని సమర్థవంతంగా అధిగమించవచ్చని తెలిపారు.
ఈ శిక్షణ శిబిరంలో జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ ఉత్తం రాజ్ రాణా, జిల్లా ఆయుష్ సిబ్బంది పాల్గొన్నారు. యోగా గురువులు పాండ్రంగి మురళీకృష్ణ, కరుటూరి నాగలక్ష్మి, సాయి లక్ష్మి, వాకర్స్ క్లబ్ ప్రతినిధి కాంక్యాన మురళి తదితరులు సిబ్బందికి వివిధ రకాల ఆసనాలు, ప్రాణాయామ పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. మానసిక ఒత్తిడిని జయించి, నిత్యం ఉత్సాహంగా విధులు నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ తమ దినచర్యలో యోగాను భాగం చేసుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖకు చెందిన సిబ్బంది, ఇతర అధికారులు ఉత్సాహంగా పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**